క్లుప్తంగా

మిత్రుడికి ఆర్థికసాయం



సాయం అందిస్తున్న మిత్రులు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన బి.జలేందర్‌గౌడ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అతడితో కలిసి 2006–07లో పదో తరగతి చదివిన మిత్రులు గురువారం అతడి ఇంటికి వెళ్లి రూ.15వేల ఆర్థికసాయం అందించారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

తానూరు: మండలంలోని బామ్ని, బామ్ని తండాలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై గురువారం బీజేపీ నాయకులు మోహన్‌రావ్‌పటేల్ ప్రచారం నిర్వహించారు. పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం బీజేపీ జెండా ఆవిష్కరించారు. జ్ఞానేశ్వర్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వంటల పోటీలు

సోన్: మండల కేంద్రంలోని పంచాయతీ మీటింగ్ హాలులో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసే సిబ్బందికి వంటల పోటీలు నిర్వహించారు. మాదాపూర్ అంగన్‌వాడీ కేంద్రం ప్రథమ, సిద్ధులకుంట అంగన్‌వాడీ కేంద్రం ద్వితీయ బహుమతులు గెలిచారు. కార్యక్రమంలో సీడీపీవో నాగమణి, ఇన్‌చార్జి సూపర్‌వైజర్ రజనీదేవి, ఏపీఎం గంగామణి, ఏపీవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

శుభ్రంగా ఉంచుకోవాలి

పెంబి: రోగాల బారిన పడకుండా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గుమ్మెన ఎంగ్లాపూర్, దోందారి, చాకిరేవు, రాంనగర్, యాపలగూడ గ్రామాల్లో వారు పర్యటించి మాట్లాడారు. ఈనెల 23వరకు ప్రతి గ్రామంలో శానిటేషన్ నిర్వహించి గ్రామాలు శుభ్రంగా ఉండేలా సర్పంచ్‌లు సహకరించాలని కోరారు. వ్యక్తిగత మరుగుదొడ్లు లేనివారు పంచాయతీ కార్యదర్శులను కలిసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంగ్లాపూర్ సర్పంచ్ వసంత్‌రావు, కార్యదర్శులు ఉన్నారు.

హెచ్ఐవీ, టీబీపై అవగాహన

కడెం: మండలంలోని అంబారిపేట్‌లో గురువారం చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం సిబ్బంది హెచ్ఐవీ, టీబీ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది మంజుల, స్వప్న, రోజ, గ్రామస్తులు, పోలీసులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు'

కుంటాల: మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిలో అధికారులు కూల్చివేసిన అక్రమ కట్టడాన్ని పరిశీలించేందుకు వచ్చిన బీజేపీ నేత పవార్ రామారావుపటేల్ ..ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాత్రి పేర్కొన్నారు. గురువారం కుంటాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సర్పంచ్ సమత, పీఏసీఎస్ చైర్మన్ సట్ల గజ్జారాం, వెంకటేశ్, పోశెట్టి, మహేశ్వర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దస్తురాబాద్: ఆయిల్‌పాం తోటల్లో రైతులు ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి తిరుపతి సూచించారు. గురువారం మండల కేంద్రంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పాం తోటలను సందర్శించి మాట్లాడారు. తోటల్లో మోగి పురుగు ప్రబలే అవకాశం ఉన్నందున.. లింగాకర్షక బుట్టల ఏర్పాటుతో పాటు వ్యాధి నివారణకు రసాయన ఎరువులు ప్రతి నెల పిచికారీ చేయాలన్నారు. ఆయిల్‌పాం ప్రీయునిక్ కంపెనీ మండల అధికారి నవీన్, రైతులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు 18 మంది ఎంపిక

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీఎస్ఎస్‌కు చెందిన 18 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికయ్యారని హెచ్ఎం బాలాజీ, ఉపాధ్యాయులు జాడి శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఫలితాలు వెల్లడించగా వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఏటా నిర్వహించే జాతీయ మాధ్యమిక ప్రతిభ ఉపకార వేతన పరీక్షకు పాఠశాలలో ఎనిమిదో తరగతికి చెందిన 40 మంది విద్యార్థులు హాజరు కాగా 18 మంది ఎంపికయ్యారు. మస్కాపూర్ పాఠశాల ఫలితాల్లో రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచింది. విద్యార్థుల ఎంపికపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

మల్చింగ్ సాగుతో లాభాలు

- కలుపు తక్కువ..దిగుబడి ఎక్కువ
- ఆసక్తి చూపుతున్న రైతులు
- 50 శాతం రాయితీ అందించి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



లోకేశ్వరం మండలం భాగాపూర్‌లో మల్చింగ్ విధానంలో పెరిగిన మొక్కలు

లోకేశ్వరం: ఆధునిక రైతులు తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయం పొందేలా మల్చింగ్ సాగు వైపు అడుగులు వేస్తున్నారు. ఈ పద్ధతిలో సాగు చేసిన పంటల్లో తక్కువ కలుపు, తక్కువ శ్రమ అవసరం ఉండటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఉద్యాన పంటలైన కూరగాయలు, పలు రకాల పూలు, పండ్ల తోటలను మల్చింగ్ విధానంలో సాగు చేస్తూ దిగుబడులు పొందవచ్చు. ఈ విధానంలో నేలలోని తేమను కాపాడుకోవడంతోపాటు నీటిని కూడా ఆదా చేసుకోవచ్చు. మారుతున్న వాతావరణ పరిస్థితులతో పంటలో మొక్కలు ఎదగడం లేదని.. ఈ విధానం ఉపయోగిస్తే రైతులకు మేలు చేకూరుతుందని జిల్లా ఉద్యానశాఖ అధికారులు తెలిపారు.

మల్చింగ్ సాగుతో ప్రయోజనాలివీ..

మొక్కల చుట్టూ నేలను ఏదైనా పదార్థంతో కప్పి ఉంచడాన్ని మల్చింగ్ అంటారు. ఈ విధానంలో సాగు చేసిన పంటలో గాలి భూమిలో చొరబడనీయకుండా నేలలోని ఉష్ణోగ్రత వాతావరణంలో కలువకుండా ఈ కవర్ ఉపయోగపడుతుంది. మొక్కపై సూర్యరశ్మి పడకుండా భూమిలో తేమశాతం తగ్గకుండా చూడటం దీని ప్రత్యేకత. పంటలో తెగుళ్లు, కలుపు వ్యాప్తి చెందకుండా, క్రిమికీటకాలు సోకకుండా మల్చింగ్ కవర్ కాపాడుతుంది. దీంతో మొక్కలు ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుంది.

మల్చింగ్ కవర్లు ఉపయోగించే విధానం..

మార్కెట్‌లో మల్చింగ్ కవర్లు మందంతో లభిస్తాయి. సీజన్‌కు అనుగుణంగా వేసే పంటలను బట్టి కవర్లను ఎంపిక చేసుకోవాలి. ఎంత విస్తీర్ణంలో పంట సాగు చేస్తారో అందుకు తగ్గటుగా సాళ్ల పొడవును బట్టి అంచనా వేసుకోవాలి. మొక్క, మొక్కకు.. వరుసకు గల దూరాన్ని బట్టి షీట్లపై రంధ్రాలు చేసుకోవాలి. చేనులో మొదట బెడ్(ఎత్తైన గట్ల పద్ధతి) సిద్ధంగా ఉంచుకోవాలి. మల్చింగ్ కవర్ బెడ్‌పై పరచి అంచులను మట్టితో కప్పాలి. దీంతో గాలికి చెదిరిపోకుండా ఉంటుంది. షీట్ల(కవర్ల)పై రంధ్రాలు చేసుకోవడంతోపాటు డ్రిప్ విధానం ద్వారా నీటిని అందించి నేలను తడిగా ఉంచుకోవాలి. తర్వాత కొద్దిగా పెరగ్గానే కాండాన్ని రంధ్రం చేసి లాగాలి. కవర్ ఉంటే కలుపు పెరిగే అవకాశం ఉండదు.

రాయితీ పొందడం ఇలా ..

మల్చింగ్ సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం రైతుల నుంచి ఏటా జూన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తుంది. ఒక హెక్టార్(2.2ఎకరాలు) సాగును ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. యూనిట్ విలువ రూ.32 వేలు కాగా..50 శాతం రాయితీ పోను రైతులు రూ.16వేలను డీడీ రూపంలో ఉద్యానశాఖకు చెల్లించాలి. మల్చింగ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు మొదట క్లస్టర్ లెవల్ ఉద్యాన అధికారిని సంప్రదించి పంటల వివరాలు తెలియజేయాలి.

డీడీ తీసి..

అధికారి ఇచ్చిన దరఖాస్తు ఫారం నింపి పాస్ ఫొటో పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లతోపాటు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పేరిట తీసిన రూ.16 వేల డీడీ అందించాలి. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత అధికారులు అందించిన మల్చింగ్ కవర్‌ను రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలో నేలపై పరచాలి.

ఉద్యానశాఖ అధికారులు వచ్చి తనిఖీ చేస్తారు. ఒక వేళ రైతులు మొత్తం విలువతో ముందుగానే కొనుగోలు చేస్తే అప్రూవుడ్ బిల్లు, పాస్ ఫొటో, ఆధార్, పట్టాదార్ పాస్‌బుక్, బ్యాంకు ఖాతా జిరాక్స్ అందించాలి. అధికారులు తనిఖీ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దీంతో కమిషనర్ నుంచి రైతులకు రాయితీ విడుదల అవుతుంది.

దరఖాస్తు చేసుకోవాలి



మల్చింగ్ విధానంలో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు పొందుతారు. మల్చింగ్ కవర్ ఉండటంతో కలుపు పెరిగే అవకాశం ఉండదు. ఆసక్తి కల్గిన రైతులు మల్చింగ్ షీట్ల రాయితీ కోసం దరఖాస్తు చేసుకోవాలి.

– హర్షవర్ధన్‌రెడ్డి, ఉద్యాన అధికారి, ముథోల్

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకరంగా మలుపు



లక్ష్మణచాంద: మండల కేంద్రం నుంచి మల్లాపూర్ వెళ్లే రోడ్డు మార్గంలో లక్ష్మణచాంద సమీపంలో మలుపు వద్ద కాలువపై కల్వర్టు గోడ కూలిపోయి ప్రమాదకరంగా ఉంది. రాత్రి రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కల్వర్టు వద్ద గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: సంజయ్‌కుమార్, పీఆర్ ఏఈ, ఫోన్: 73821 11688

కొనుగోలు కేంద్రాల ప్రారంభం



కేంద్రం ప్రారంభిస్తున్న నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్

కుంటాల: మండలంలోని లింబా(బి)లో ఐకేపీ ఆధ్వర్యంలో, ఓలాలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం సర్పంచ్‌లు, పెద్దికాపు మల్లేశ్, కనీష్‌ఫాతిమా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కట్ట రవి, ఏపీఎం భోజన్న, శ్రీరాం, నారాయణ్‌పటేల్, శంకర్ గౌడ్, యూసుఫ్, నిర్వాహకుడు లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: మండలంలోని ఎల్లాపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ రవీందర్‌రెడ్డి, రాజారెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ

దస్తురాబాద్: మండలంలోని భూత్కూర్ పంచాయతీలోని రాంపూర్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ లక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలింపు పనులు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట పలువురు సిబ్బంది ఉన్నారు.

'తేమ పేరుతో కోత విధించొద్దు'

ఖానాపూర్: వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే పంటలో అధికారులు తాలు, తప్ప, తేమ పేరిట కోతలు విధించి రైతులకు నష్టం చేయవద్దని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోవింద్ అన్నారు. గురువారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేల పరిహారం ప్రభుత్వం చెల్లించాలన్నారు. పోడు భూములకు పట్టాలిచ్చి నకిలీ విత్తనాలు, అధిక ధరలను అరికట్టాలన్నారు. లేకపోతే లంబాడా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

కడెం: ఖానాపూర్, కడెం, దస్తురాబాద్ మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు రాజేశ్ అన్నారు. కేంద్రాల్లో బస్తాకు అదనంగా తూకం వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని.. సంబంధిత అధికారులు పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు విలాస్, సంతోశ్ ఉన్నారు.

సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి విలాస్ మాట్లాడారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో మొదటి విడతలో నిర్వహించిన బీజేపీ హటావో..దేశ్ కో బచావో కార్యక్రమం విజయవంతంగా ముగిసిందన్నారు. ఇంటింటి సీపీఐ కార్యక్రమ ముగింపు సభ జూన్ 4న కొత్తగూడెంలో లక్ష మందితో నిర్వహిస్తామని.. దీనికి జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరు అవుతారని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఆర్.ఉపాలి, కొండిబా, రమేశ్, కె.ఎస్ రావు, పిండారి ముత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీసేందుకే సీఎం కప్ పోటీలు



బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

దస్తురాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడా నైపుణ్యం వెలికితీసేందుకే ప్రభుత్వం సీఎం కప్ పోటీలను ఏర్పాటు చేసిందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ రాజునాయక్, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు శంకర్, అంజన్న, భూమేశ్, ఉపసర్పంచ్‌లు గోపాల్, మాణిక్యరావ్, నాయకులు శివయ్య, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

పెంబి: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే రేఖానాయక్ పాల్గొననున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

క్రికెట్ టోర్నీ విజేత సోన్ జట్టు

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్‌లో పోసులు–ఎల్లవ్వల స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా సోన్ జట్టు నిలిచింది. గురువారం ఫైనల్‌లో మల్లాపూర్ జట్టుపై సోన్ జట్టు విజయం సాధించింది. విజేతకు డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీతో పాటు రూ.20 వేలు, రన్నరప్ మల్లాపూర్ జట్టుకు రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు సురేందర్‌రెడ్డి, కేశం రమేశ్, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్ భూమిలో పనులు అడ్డగింత

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ శివారులో 33 ఏళ్లుగా సాగు చేస్తున్న ఐదెకరాల భూమిని ఆ ఊరి సర్పంచ్, వీడీసీ సభ్యులు కబ్జా చేశారని ఇదే మండలంలోని కన్కపూర్ గ్రామానికి చెందిన కొబ్బన్నోల్ల పెద్దగంగన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. అబ్దుల్లాపూర్ గ్రామస్తులు కూడా ఫిర్యాదు చేయడంతో ఈ భూమి వివాదం కోర్టు పరిధిలో ఉంది. గురువారం పెద్ద గంగన్న అబ్దుల్లాపూర్ శివారులోని భూమిని తన ట్రాక్టర్‌తో దున్నే పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ముథోల్ తహసీల్దార్ తుకారం సంఘటన స్థలానికి వెళ్లి పనులు అడ్డుకున్నారు. భూవివాదం కోర్టు పరిధిలో ఉందని.. ఎలాంటి పనులు చేసిన చర్యలు తీసుకుంటామని సూచించారు. గంగన్నపై లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు.

రోడ్డుపై పడిన చెట్లు తొలగింపు

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి వద్ద గురువారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో తిర్పెల్లి నుంచి పొన్కల్ వెళ్లే మార్గంలో రోడ్డుపై రెండు చెట్లు పడిపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ క్రిష్టారెడ్డి అక్కడకు వెళ్లి రోడ్డుపై పడిన చెట్లను తొలగించారు. దీంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోయాయి.

రోడ్డు పనులకు భూమిపూజ

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో బీసీ కాలనీలో చేపట్టే రోడ్డు పనులకు గురువారం డీసీసీబీ వైస్‌చైర్మన్ రఘునందన్‌రెడ్డి భూమిపూజ చేశారు. బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీ అనిత, ఉపసర్పంచ్ రమణ, మధు, మహిపాల్‌రెడ్డి, సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని మొగ్లిలో రూ.2.50 లక్షలతో సీసీ రోడ్డు పనులను గురువారం ఎంపీటీసీ లక్ష్మణ్ ప్రారంభించారు. సర్పంచ్ పుండలిక్, కార్యదర్శి విఠల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వెదజల్లే విధానంతో అధిక లాభాలు



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వీణ

భైంసారూరల్: వరి సాగులో వడ్లు వెదజల్లే విధానంతో పెట్టుబడులు తగ్గి లాభాలు పెరుగుతాయని ఏడీఏ వీణ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గురువారం రైతులకు వడ్లు వెదజల్లే విధానంతో కలిగే లాభాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఏడీఏను రైతులు సన్మానించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఓ రాంచందర్ నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చాకేటి లస్మన్న, ఏఈఓలు లక్ష్మి, రజిత, సౌమ్య, బీఆర్ఎస్ నాయకులు భూమారెడ్డి, గోపి, రమేశ్, సంజీవ్, గణేశ్, రామేశ్వర్ తదితరులు ఉన్నారు.

'తొలగించిన ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేస్తాం'

సాక్షి ఎఫెక్ట్



పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

భైంసాటౌన్: 'భైంసాలో ఓపెన్‌జిమ్ మాయం' అనే శీర్షికన ఈనెల 16న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు కుంట ప్రాంతంలోని ఓపెన్‌జిమ్ స్థలం నుంచి తొలగించిన జిమ్ పరికరాలను తిరిగి ఏర్పాటు చేస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఓపెన్‌జిమ్ స్థలంలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వేనం 134/బి లో ప్రభుత్వం 13.5 గుంటల స్థలం షాదీఖానా కోసం కేటాయించిందన్నారు. దీంతో సదరు స్థలంలో ఓపెన్‌జిమ్ తొలగించి షాదీఖానా నిర్మిస్తున్నారని తెలిపారు. ఈమేరకు ప్రైవేట్ స్థలంలో ఉంచిన ఓపెన్ జిమ్ పరికరాలను మున్సిపల్ అధికారులకు స్వాధీనం చేసినట్లు తెలిపారు.

నేటి ప్రదర్శన విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రపై శుక్రవారం నిర్వహించే నాటిక ప్రదర్శనను విజయవంతం చేయాలని దళిత సంఘాల నాయకులు కోరారు. టీఎన్జీవో సంఘ భవనంలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మహనీయుల జీవిత చరిత్రపై సాయంత్రం ఆరు గంటలకు నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. సమావేశంలో డి.రాములు, మెట్టు గంగాధర్, కె.వెంకటస్వామి, రొడ్డ గంగన్న, బేర పరమేశ్, నరసింహ స్వామి, కాంబ్లే సూర్యకాంత్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో దుకాణాలు తొలగింపు



దుకాణాలు తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నిర్మల్‌టౌన్: నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కేంద్రంలో బస్టాండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఏర్పాటు చేసిన పండ్లు, కూరగాయల దుకాణాలను గురువారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. రోడ్డుపై ఉన్న పలువురి పండ్ల డబ్బాలు, తోపుడు బండ్లను స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ మాట్లాడుతూ పట్టణ సీఐ మల్లేష్ ఆదేశాల మేరకు దుకాణాలు తొలగించామన్నారు. రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కల్గించొద్దని హెచ్చరించారు.

కూలీలకు మజ్జిగ పంపిణీ

కడెం:మండలంలోని కన్నాపూర్ గ్రామంలో ఉపాధి కూలీలకు గురువారం కాంగ్రెస్ నాయకుడు తుమ్మల మల్లేశ్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పేదప్రజల కోసమే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వాజీద్‌ఖాన్, భూషణం, బబ్లూ, బ్రహ్మచారి, రఫీ, తదితరులు ఉన్నారు.

వానాకాలం సాగుకు విత్తనాలు సిద్ధం

మామడ: వానాకాలం సాగు కోసం సీడ్ విత్తనాలు సిద్ధంగా ఉంచినట్లు గురువారం తెలంగాణ సీడ్ డెవలప్‌మెంట్ రీజినల్ కోఆర్డినేటర్ అతుల్ జైన్ ఓ ప్రకటనలో తెలిపారు. పప్పుదినుసుల్లో పెసర విత్తనాలు ఎంజీజీ–295 రకం రెండు కిలోల బస్తాకు రూ.216, మినుములు పీయూ–31 రకం రెండు కిలోల విత్తనాలకు రూ.212, వరి విత్తనాలు యంటీయూ –1010 రకం 25కిలోల బస్తాకు రూ.882, యంటీయూ–1,001రకం, కేఎన్ఎం–118 రకం, జేజీఎల్ –24423 రకం 25కిలోల బస్తా ధర రూ.880 ఉందని తెలిపారు. వీటిని జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. అవసరమైన రైతులు తీసుకువెళ్లాలని కోరారు.

గ్రామాల్లో కంటివెలుగు ప్రారంభం

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్‌లో గురువారం కంటివెలుగు వైద్య శిబిరాన్ని సర్పంచ్ సంగెం నర్సయ్య ప్రారంభించారు. వైద్యాధికారి సందీప్, ఎంపీటీసీ నర్సవ్వ, ఉపసర్పంచ్ రుక్మాలు ఉన్నారు.

సారంగపూర్: మండలంలోని వైకుంఠాపూర్‌లో గురువారం ఎంపీపీ మహిపాల్‌రెడ్డి కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, చిన్నయ్య, డాక్టర్ సుభాష్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని రాజురా గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని గురువారం సర్పంచ్ చిన్నం లావణ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజు, డాక్టర్ శ్రీవిద్య, ఉపసర్పంచ్ పద్మ, ఎంపీవో చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

భక్తుల సందడి

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఓలా, కుంటాల, అందకూర్, విఠాపూర్, వెంకూర్, అంబకంటి గ్రామాల మహిళలు సాయి నామ స్మరణ చేస్తూ ఆలయానికి పాదయాత్రగా చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు.